క్లుప్తంగా

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

అమలాపురం రూరల్: కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అర్జీదారులు, వినతులను స్వీకరించనున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం (పీజీఆర్ఎస్) ద్వారా అర్జీల తీసుకుంటారని తెలిపారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో పాటు మూడు రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రాల్లో, నాలుగు మునిసిపల్ ప్రధాన కార్యాలయాల్లో, 22 మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తార న్నారు. అర్జీదారులు తమ అర్జీలను పీజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల పరిష్కార స్థితిగతులు సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100కు నేరుగా ఫోన్ చేసి సంప్రదించవచ్చునని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఘనంగా నక్షత్ర పూజలు

ఉప్పలగుప్తం: భీమనపల్లిలో భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రవణా నక్షత్ర పూజలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు పెద్దింటి శ్రీనివాసాచార్యులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ చేసారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అన్నదానానికి రూ.20,116 విరాళం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యం రాత్రి జరిగే అన్నదాన పథకానికి ఓ భక్తుడు విరాళం అందజేశారు. విశాఖపట్టణానికి చెందిన తెలిదేవర శివశంకర్ ఆదివారం రూ.20,116 అన్నదాన ట్రస్టుకు సహాయక కమిషనర్ వి.సత్యనారాయణకు అందజేశారు. ఈసందర్భంగా దాతను ఆలయ మర్యాదలతో స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందజేసి సత్కరించారు.

400 మందికి వైద్య సేవలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న శివరామ సుబ్రహ్మణ్యం, జిల్లా సంఘం నాయకులు

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం, అమలాపురం వైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో మెగా వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఆర్య వైశ్య నాయకుడు, ఏపీ ఐవీసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. వెరికోస్ వెయిన్స్, గుండె, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రో, స్కిన్, గైనిక్, డెంటల్, ఈఎన్టీ, జనరల్ మెడిసన్ తదితర వైద్య విభాగాల్లో ఉచిత వైద్య శిబిరంలో వైద్య సేవలను రోగులు సద్వినియోగం చేసుకున్నారు. రోగులకు పరీక్షలు, మందులు ఉచితంగా అందించారు. దాదాపు 400 మంది వైద్య సేవలను ఉపయోగించుకున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి, కార్యదర్శి కూసుమంచి పాపారావు, కోశాధికారి కంచర్ల కృష్ణమోహన్, సంఘం మెడికల్ కమిటీ చైర్మన్ పచ్చిపులుసు కృష్ణారావు, ఉపాధ్యక్షుడు వరదా సూరిబాబు, అమలాపురం వైశ్య సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి తదితరులు శిబిరానికి హాజరైన రోగులకు సేవలు అందించారు.

టెంట్ సప్లయర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

యానాం: టెంట్‌హౌస్, లైటింగ్, డెకరేషన్స్, సౌండ్స్,ఎల్ఈడీ స్క్రీన్స్ వ్యాపారం చేసే వర్తకులు ఆదివారం శ్రీలక్ష్మీ వినాయక టెంట్ సప్లయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో యానాంలోని అంబేద్కర్‌నగర్‌లో కంచర్ల రామకృష్ణయ్య, పద్మావతి కల్యాణ మండపంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడిగా శేరు మురళి, అధ్యక్షుడిగా మేడిశెట్టి నాగేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా ర్యాలీ సుధాకర్, సెక్రటరీగా నిమ్మకాయల భావన్నారాయణ, జాయింట్ సెక్రటరీగా అద్దంకి దుర్గబాబు, ట్రెజరర్‌గా బొండాడ నవీన్, సలహాదారుడిగా మెల్లం మహేష్, మరో అయిదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ద్రాక్షారామ భీమేశ్వర లైటింగ్ యూనియన్ ప్రతినిధులు వాసంశెట్టి చినబాబు, తాళ్లరేవు శ్రీకాలభైరవ లైటింగ్ యూనియన్ ప్రతినిధులు సత్యనారాయణ, మల్లాడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

ముమ్మిడివరం: నగర పంచాయతీ పరిధిలో కాశివాని తూము నుంచి చింతల మెరక వరకు ఎంపీ లాడ్స్ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధూర్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర పంచాయతీలో అన్ని పుంత రోడ్ల ఆధునీకరణకు నిధులు సమకూరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాట్ల పృధ్వీరాజ్, గుత్తుల సాయి, చెల్లి అశోక్, తాడి నరసింహమూర్తి, గొలకోటి దొరబాబు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజలకు వివరిద్దాం



సభలో మాట్లాడుతున్న పినిపే విశ్వరూప్. చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి, విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్, పార్టీ నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు



చంద్రబాబు హామీల మోసాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న జగ్గిరెడ్డి, విజయలక్ష్మి, విశ్వరూప్, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్, పార్టీ నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు

- బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీపై విస్తృత ప్రచారం
- వెన్నుపోటుకు, అబద్ధాలకు చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్
- అమలాపురం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో విశ్వరూప్

అమలాపురం టౌన్/ అమలాపురం రూరల్: చంద్రబాబు మోసాలను క్షేత్ర స్థాయిలో గడపగడపకూ వెళ్లి వివరిద్దాం, బాబు ష్యూరిటీ- మోసం గార్యంటీపై ప్రజలకు అవగాహన కల్పిద్దామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు, అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటస్ పినిపే విశ్వరూప్ స్పష్టం చేశారు. స్థానిక వాసర్ల గార్డెన్స్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన అమలాపురం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొని బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీపై మాట్లాడారు. చంద్రబాబు మోసాలకు, వెన్నుపోటుకు, అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ అని విశ్వరూప్ విమర్శించారు. అమలాపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, రామచంద్రపురం, పి.గన్నవరం నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు పిల్లి సూర్యప్రకాష్, గన్నవరపు శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఏడాది పాలన అంతా అమలు కాని అబద్ధపు హామీలతో సాగిందని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని కూటమి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రజలు వద్దకు వెళుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు కూటమి మేనిఫెస్టో పట్టుకుని వెళ్లి చర్చించే దమ్ము ఉందా?అని సవాల్ విసిరారు.

కార్యకర్తలకు ప్రాధాన్యం

అమలాపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ వచ్చేది వైఎస్సార్ సీపీ కార్యకర్తల ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కార్యకర్తలకు పెద్ద పీట వేసేలా రాబోయే వైఎస్సార్ సీపీ పాలన ఉంటుందని స్పష్టం చేశారు. రామచంద్రపురం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ మాట్లాడుతూ పోలీసులు పెట్టే తప్పుడు కేసులకు అదరొద్దు, బెదరొద్దు, పార్టీ బాధితులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ కో ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాల ద్వారా క్షేత్రస్థాయికి మనమంతా వెళ్లి బాబు మోసాలను ఎండగడదామని పిలుపునిచ్చారు. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన బాండ్లు, హామీలు తదితర విషయాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్లతో ఉన్న పత్రాలను జిల్లా పార్టీ నేతలు సమావేశంలో ఆవిష్కరించారు. తొలుత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి జిల్లా పార్టీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అమలాపురం పట్టణ, మండలాల పార్టీల అధ్యక్షులు సంసాని బులినాని, గుత్తుల చిరంజీవి, కొనుకు బాపూజీ, బద్రి బాబ్జి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఎంపీపీలు కుడుపూడి భాగ్యలక్ష్మి, ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామగోపాల్, గెద్దం సంపదరావు, కొనుకు గౌతమి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, దంగేటి రాంబాబు, కర్రి పాపారాయుడు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు పేరి శ్రీనివాసరావు, కుడుపూడి సత్య శైలజ, జిల్లా పార్టీ అనుబంధ కమిటీల అధ్యక్షులు మట్టపర్తి నాగేంద్ర, షేక్ అబ్దుల్ ఖాదర్, వంగా గిరిజాకుమారి, జిన్నూరి వెంకటేశ్వరావు, జాన సుభాష్ చంద్ర గణేష్, చీకట్ల కిషోర్, సూదా గణపతి, కుంచే వెంకటరమణారావు, దొమ్మేటి సత్యమోహన్, కుడుపూడి బాబు, ఉంగ్రు వెంకటేష్, పొగాకు శ్రీను, చింతా రామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, మండల వైస్ ఎంపీపీలు అడపా సుబ్రహ్మణ్యేశ్వరరావు, పొలమూరి బాలకృష్ణ, పార్టీ యువజన నాయకులు దూడల ఫణి, కేతా భానుతేజ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీదే అంతిమ విజయం

పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ రెట్టింపు సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్న కూటమి హామీలను ప్రజలు నమ్మి మోసపోయారని చెప్పారు. ప్రజాక్షేత్రంలో అంతిమ విజయం మాత్రం వైఎస్సార్ సీపీదేనని ఆమె స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ ఏడాది తరువాత కూటమి ప్రభుత్వం నుంచి 50 నుంచి 60 మంది ఎమ్మెల్యేలు చంద్రబాబు మోసపూరిత పాలన నుంచి బయటకు వచ్చేస్తారని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల గుట్టు రట్టు అవుతుందని, ఆ ఎన్నికల్లో ఎదుర్కొనే సత్తా లేకే తమకున్న ఎల్లో మీడియా ద్వారా వైఎస్సార్ సీపీపై అసత్య ప్రచారం చేస్తూ పబ్బం గడుపుతోందని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ జిల్లాలో కూటమి ఎమ్మెల్యేలు ఇసుక ర్యాంపుల ద్వారా అక్రమార్జన చేస్తున్నారని ఆరోపించారు, అమలాపురం నియోజకవర్గంలోనే బోడసకుర్రు వంతెన వద్ద ఉన్న వైనతేయ నదీ గర్భంలోనే ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తవ్వేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

జగ్గిరెడ్డి, విజయలక్ష్మికి ఘన సత్కారం



జగ్గిరెడ్డిని సత్కరిస్తున్న విశ్వరూప్, శ్రీకాంత్

అమలాపురం రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన చిర్ల జగ్గిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మిని పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, అమలాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ ఘనంగా సత్కరించారు. అమలాపురం వాసర్ల వెంకన్న కల్యాణ మండపంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంలో వారిని సత్కరించారు. పి.గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, రామచంద్రపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి ప్రకాష్, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్ కుడుపూడి సూర్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు సంసాని నాని తదితరులు గజామాలతో సత్కరించారు. కళ్యాణ మండపం అధినేత వాసర్ల వెంకన్నను ఘనంగా సత్కరించారు.

జాతీయ యోగా పోటీలకు ఉషశ్రీ ఎంపిక



ఉషశ్రీ

అమలాపురం టౌన్: అమలాపురం స్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ సౌజన్యంతో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో సత్తా చాటిన అద్దగళ్ల ఉషశ్రీ జాతీయ పోటీలకు ఎంపికైందని ఆ యోగాశ్రమ గురువు డాక్టర్ ఆకుల శ్రీనివాస్ తెలిపారు. పి.గన్నవరానికి చెందిన ప్రస్తుతం ఉద్యోగ రీత్యా ఏలూరులో ఉంటున్న ఉషశ్రీ ఈనెల 6న అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనబరిచింది. సీనియర్స్ విభాగంలో ఎంపికై న ఉషశ్రీ ఈనెల 14,15,16 తేదీల్లో మూడు రోజులపాటు ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ పోటీలకు పాల్గొంటుందని యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉషశ్రీ అమలాపురం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమం నుంచి జాతీయ పోటీలకు వెళుతున్నారని తెలిపారు. ఉషశ్రీ జాతీయ స్థాయిలో పోటీల్లో కూడా విజయం సాధించి విజేతగా తిరిగి రావాలని యోగా గురువు డాక్టర్ శ్రీనివాస్ ఆకాంక్షించారు.

కవి రాంబాబుకు సత్కారం

కాట్రేనికోన: భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు సాహితీ వనం సాహిత్య సంస్థ 8వ వార్షికోత్సవం శనివారం హైదరాబాద్ రవీంద్ర భారతి కాన్ఫరెన్సు హాలులో సంస్థ వ్యవస్థాపకుడు శాంతి కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాహితీ సంస్థ ప్రతి నెల కవితా పోటీలను నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తుంది. కవుల సమ్మేళనంలో విజేతగా నిలిచిన కాట్రేనికోన మండలం నడవపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు కవి చింతా రాంబాబును సంస్థ ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, జర్నలిస్ట్ సత్యాజీ, కంచిపాటి వెంకట్, ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె

ముమ్మిడివరం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు ఆదివారం నుంచి నిరవధిక సమ్మె ప్రారంభించారు. సమ్మెకాలపు ఒప్పందాల ప్రకారం జీఓ- 36 అనుసరించి జీతాలు పెంచాలని, ప్రభుత్వంలో ఇప్పటివరకు రెండు దఫాలు చర్చలు నిర్వహించినా న్యాయం చేయలేదని వారన్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెకు దిగామన్నారు. వీధి దీపాల నిర్వహణ, తాగునీరు సరఫరా నిలుపుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, ఎస్.అజయ్‌కుమార్, వి.వెంకటేశ్వరులు, జి.రమేష్, వై.రమణ, జి.వెంకటేశ్వరరావు, కే.శ్రీనివాసరావు, వి.ప్రసాద్ కే.శివ పాల్గొన్నారు

నిరుద్యోగులకు వయస్సు సడలింపుపై చర్చ

యానాం: ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో నిరుద్యోగులకు వయస్సు సడలింపుపై ఆదివారం కేంద్ర హోంశాఖ అదనపు కార్యదర్శి నితీష్‌కుమార్ వ్యాస్‌తో సీఎం రంగసామి సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత వేలాది ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టిన నేపథ్యంలో అభ్యర్థులకు వయస్సు సడలింపు ఆవశ్యకతను వివరించారు. త్వరలో ఈ అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ప్రకటించే అవకాశం ఉంది. ఈ సమావేశంలో మంత్రి నమశ్శివాయం, ప్రధాన కార్యదర్శి శరత్ చౌహాన్ పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి వరద ఉధృతి



యానాం-ఎదుర్లంక వంతెన వద్ద ప్రవాహం



బాలయోగి కాలనీలో ప్రవేశించిన వరదనీరు

యానాం: గౌతమీ గోదావరి వరదనీటి ఉధృతి పెరుగుతుండటంతో యానాంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆర్ఏఓ మునిస్వామి ఎప్పటికప్పుడు పీడబ్ల్యూడీ అధికారులతో చర్చిస్తున్నారు. ఆదివారం పట్టణ పరిధిలోని లోతట్టు ప్రాంతమైన బాలయోగి కాలనీ వీధుల్లో వరదనీరు ప్రవేశించింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరద ప్రవాహం క్రమేణా పెరుగుగుండటంతో సంబంధిత అధికారులు వరదనీరు రాకుండా చర్యలు చేపట్టారు. ఓల్డ్ రాజీవ్‌నగర్ చెంత నిర్మాణం చేసిన నూతన లాకు గేట్లను మూసేవిధంగా పీడబ్ల్యూడీ అధికారులు చర్యలు చేపట్టారు. బాలయోగి కాలనీలోకి ప్రవేశించిన వరదనీటిని బయటకు మోటార్లతో తోడుతున్నారు. ఫెర్రీ రహదారిలోకి వరదనీరు ప్రవేశించింది. ఈ రోడ్డులో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యానాం-ఎదుర్లంక బాలయోగి వారధి వద్ద ముందస్తుగా సందర్శకులు వెళ్లకుండా పోలీసులు, అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది.

పేదల సమస్యలపై వేగంగా స్పందించాలి



రాజబాబు దంపతులను సత్కరిస్తున్న జగ్జీవన్ రామ్ సొసైటీ అధ్యక్షుడు తదితరులు

అమలాపురం రూరల్: పేద దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యలపై అధికారులు వేగంగా స్పందించి పరిష్కరించాలని బాబూ జగ్జీవన్ రామ్ సొసైటీ సభ్యులు అన్నారు. ఏపీడీసీఎల్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యుత్ శాఖలో జిల్లా సూపరిండెంట్‌గా పని చేస్తూ విశాఖపట్నం సీజీఎం వీగా పదోన్నతిపై వెళ్లిన సిద్దల రాజబాబు దంపతులకు బాబూ జగ్జీవన్ రామ్ సొసైటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఆదివారం నడిపూడిలో బాబూ జగ్జీవన్ రామ్ భవన్‌లో అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. విశాఖపట్నంలో సీజీఎం వీగా పదోన్నతిపై విద్యుత్ సమస్యల పరిష్కర వేదిక టెక్నికల్ సభ్యుడిగా పనిచేస్తున్న ఎస్ రాజబాబు దంపతులను సంఘం నాయకులు శాలువా, గజమాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. తహసీల్దార్ పలివెల అశోకప్రసాద్, ఈఈలు విజయానంద్, రాంబాబు, రత్నాలరావు, రాష్ట్ర దండోరా సీనియర్ నాయకులు బోయిలపల్లి కరుణాకర్, పెద్దాపురం ఏఈ కాప రామచంద్రరావు, పదవీ విరమణ పొందిన లైన్‌ఇన్‌స్పెక్టర్ సవరపు నాగేశ్వరరావు, రాష్ట్ర కరాటే పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన మంద మౌనిక, ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రథమ బహుమతి సాధించిన దళిత యువ కవయిత్రి కావ్యలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సభ్యులు యార్లగడ్డ రవీంద్ర, పొలమూరి ధర్మపాల్, విశాఖపట్నం ఎల్ఐసీ జోనల్ మేనేజర్ పొలమూరి సత్యనారాయణ, రాష్ట్ర బాబు జగ్జీవన్ రామ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు మడికి శ్రీరాములు, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

హోరాహోరీగా షటిల్ టోర్నీ



ఉత్తమ పనితీరు కనబరిచినవారికి ఐఓసీ అవార్డుల ప్రదానం

యానాం: విశాఖ రీజియన్ పరిధిలో ఇండియన్ ఆయిల్ కంపెనీకి చెందిన కాకినాడ, అమలాపురం ఆర్ఎస్ఏ పరిధిలో పలువురు ఐఓసీ డీలర్లకు టీమ్ బిల్డింగ్ యాక్టివిటీలో భాగంగా ఆదివారం స్థానిక వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 13 జట్లు తలపడగా విజేతగా యానాం బైపాస్ రహదారిలో ప్లాస్ ఐఓసీ బంకు యజమాని మల్లాడి రఘువంశీ, చైతన్య విజేతలు నిలిచారు. రన్నర్లుగా రాజబాబు, మహేశ్వరరావు నిలిచారు. ఈ సందర్భంగా విజేతలకు ఐఓసీ డివిజినల్ మేనేజర్ హెచ్ బుచ్చయ్య, మేనేజర్ చైతన్య, సేల్స్ ఆఫీసర్ వెంకటేష్ బహుమతులు అందజేశారు. అనంతరం యానాం అగ్నికులక్షత్రియ కల్యాణ మండపంలో ఐఓసీ డీలర్లకు, ఆఫీసర్లకు సమావేశాన్ని నిర్వహించారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐఓసీ బంక్‌లకు అవార్డులను బహూకరించారు. నాలుగు అవార్డులను ప్లాస్ బంక్ దక్కించుకుంది. ఈ సందర్భంగా రఘువంశీకి అవార్డులను అందజేశారు.

వైభవంగా సుబ్బాలమ్మ జాతర



సుబ్బాలమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: స్థానిక హైస్కూలు సెంటరులో ఆంధ్ర వాలా ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణ దేవత సుబ్బాలమ్మ జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. హైస్కూలు సెంటరులోని విజయ దుర్గమ్మ ఆలయం వద్ద ఈ ఉత్సవాలు మొదలయ్యాయి. అనంతరం ఆ ఆలయం నుంచి పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానం వరకూ యూనియన్ కార్మికులతో భారీ ఊరేగింపు నిర్వహించారు. గరగ నృత్యాలు, మేళ తాళాలు, బాణసంచా కాల్పులతో పురవీధుల్లో ఊరేగింపు వైభవంగా సాగింది. బెల్లం పానకం, చలిమిడి తదితర కావిళ్లతో అమ్మవారికి మొక్కలు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాల్లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్ దొమ్మేటి రాము, పార్టీ నాయకుడు వాసర్ల వెంకన్న, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.సత్తిబాబు, ఆటో యూనియన్ ప్రతినిధులు రాయుడు ప్రసాద్, బొమ్మి ఫణీంద్ర, ఊటాల వెంకటేష్, గుత్తుల రామకృష్ణ, నెల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పణ



అమలాపురం వేపచెట్టు కనకదుర్గమ్మకు ఆషాఢం సారెను సమర్పించిన మహిళలు

తాళ్లరేవు: సుంకరపాలెంలో కొలువైన గ్రామదేవత ముత్యాలమ్మవారికి ఆదివారం ఆడపడుచులతో ఆషాఢమాస సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకంబరి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పలు రకాల పిండివంటలతో, చలివిడి, వడపప్పు పానకాలతో సారె సమర్పించారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ఆడపడుచులతో పంచాయతీ వద్ద నుంచి ఊరేగింపుగా గ్రామ వీధుల్లో సంప్రదాయ పద్ధతుల్లో సారెతో ఆలయం వద్దకు వచ్చి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మోపూరి వెంకటరెడ్డినాయుడు, పెద్దిరెడ్డి విఘ్నేశ్వరరావు, దుర్గాపుసాయిరాం, చిక్కం హనుమంతరావు, గుంటముక్కల సూరిబాబు, సుంకర కార్తీక్, సూర్యానారాయణ, విఘ్నేశ్వరరావు, గణేష్ , రాజు, శ్రీను, వీరబాబు, ప్రసాద్, మధు పాల్గొన్నారు.

అమ్మవారికి కుంకుమార్చన

కాట్రేనికోన: ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా కాట్రేనికోన మావుళ్లమ్మవారికి చింతలమెరకలో విజయ దుర్గాదేవి అమ్మవార్లకు కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆణివిళ్ల సాయిబాబు ఆధ్వర్యంలో అమ్మవారికి మహిళలతో సామూహిక కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. శ్రీవిజయ దుర్గాదేవి ఆలయ అర్చకులు ఆకొండి శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మహిళలు శ్రీవిజయ దుర్గాదేవికి పసుపు, కుంకుమ,పట్టు వస్త్రాలు సారెను సమర్పించారు.

అమలాపురం టౌన్: పట్టణంలోని కల్వకొలను వీధిలో కొలువై ఉన్న వేపచెట్టు కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢ మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. వందలాది మహిళలు ఆదివారం ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి వచ్చి ఆషాఢం సారెను సమర్పించారు. ఆరు కావిళ్లలో బెల్లం పానకం, చలిమిడితోపాటు 500 కిలోల పలు రకాల మిఠాయిలు అమ్మవారి ముంగిట ప్రదర్శనగా ఉంచారు. మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు సాగింది. వేపచెట్టు కనకదుర్గమ్మను కల్వకొలనువీధి, మెబర్లీపేట, నల్లావీధికి చెందినవారు ఆరాధ్య దేవతగా కొలుస్తారు. ఏటా ఆషాఢ మాసంలో అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. మహిళలు పసుపు చీరుల ధరించి అమ్మవారికి సారెను సమర్పించారు. స్థానిక చెన్న మల్లేశ్వరస్వామి దేవస్థానం వద్దకు మహిళలంతా చేరుకుని అక్కడి నుంచి పలు అమ్మ వారి ఆలయాలకు మహిళలు కావిళ్లు, సారెలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ఆషాఢం సారెను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రకరకాల పండ్లు, పువ్వులు అమ్మవారికి సమర్పించారు.

చరిత్రకు సాక్ష్యాలుగా షోల్‌షెర్, మరియన్నె విగ్రహాలు

- ఫ్రెంచి నేషనల్ డే రోజున ఏర్పాటు
- యానాంలో నేటికీ చెక్కుచెదరని విగ్రహాలు



మరియన్నె విగ్రహం



విక్టర్ షోల్‌షెర్ విగ్రహం

యానాం: ఫ్రెంచి పరిపాలనా కాలంలో యానాంలో ఏర్పాటుచేసిన మారియన్నె, షోల్‌షెర్ (విక్టర్) విగ్రహాలు వాటి చారిత్రక ప్రాముఖ్యతను తెలియజేస్తుంటాయి. మారియన్నె విగ్రహం యానాం ఆర్ఏఓ భవనంలో, షోల్‌షెర్ (విక్టర్) విగ్రహం మున్సిపాలిటీ భవనంలో ఉంది. ఈ రెండు విగ్రహాలను బాస్టిల్ డే చిహ్నంగా ఏర్పాటు చేశారు. ఎంతో ప్రాముఖ్యతగల ఈ రెండు విగ్రహాలను యానాంలో 1887లో జూలై 14 బాస్టిల్ డేను పురస్కరించుకుని ఫ్రెంచి జాతీయ దినోత్సవం రోజున ఏర్పాటు చేశారు. బానిసత్వ నిర్మూలన కోసం, నల్లజాతీయుల హక్కుల కోసం పోరాడిన ఫ్రెంచి రచయిత విక్టర్ షోల్‌షెర్ విగ్రహాన్ని స్థానిక మున్సిపల్ హాలులో నెలకొల్పారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వానికి చిహ్నంగా ఒక సాధారణ వనిత మరియన్నె విగ్రహాన్ని ఆర్ఏఓ భవనంలో ఫ్రెంచి కాలంలోనే నెలకొల్పారు. ఆనాడు మరియన్నె విగ్రహాన్ని స్థానికులు గొల్లభామగా పిలుచుకునేవారు. ఈ రెండు విగ్రహాలను అప్పటి ఫ్రెంచి దొర మిస్టర్ ఎమ్ లీ యానాంలో ఆవిష్కరించారు. ఫ్రెంచి విప్లవాన్ని మలుపుతిప్పిన ఘటనగా 1789, జూలై14న బాస్టిల్‌కోట ముట్టడిని పేర్కొంటారు. 1878 నుంచి ఫ్రాన్స్ ప్రభుత్వం 'ఫెతె దె నేషనల్' పేరిట ప్రభుత్వం ఉత్సవాన్ని నిర్వహిస్తోంది.యానాంలోనూ జూలై 14న బాస్టిల్ డే సంబరాలు నిర్వహిస్తారు.